

రేపు విద్యుత్ కార్మికుల ధర్నా

బద్వేలు : యునైటెడ్ ఆధ్వర్యంలో కడప విద్యుత్ భవనం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక సిబ్బంది పట్టణ కార్యాలయంలో శనివారం యునైటెడ్ సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రతినెలా 1న వెంటనే జీతాలను కొనసాగించాలని, జిల్లా వ్యాప్తంగా కారుణ్య నియామకాల కింద చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించబోయే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిబ్బంది జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, మైదుకూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి పిసి కొండయ్య, బద్వేల్ సబ్ డివిజన్ నాయకులు కరీం, రమణ, పెంచలయ్య సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు ఆపాలి

- సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగంలో సంస్కరణల పేరుతో నిర్వీర్యం చేసే ప్రయత్నం మానుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ. రామమోహన్ డిమాండ్ చేశారు. శనివారం పూలే సర్కిల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపాలని, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. పాత బస్టాండ్లో ఉన్న సిపిఎం కార్యాలయం నుంచి పూలే సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా రాష్ట్రాల్లో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేసేలా ఒత్తిడి చేయడం సమంజసం కాదన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల వినియోగదారుడు మీద అదనపు భారం పడడం తప్ప ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలు నష్టాలు వస్తున్న పేరుతో ట్రూ అప్ ఛార్జీలు అదనంగా వసూలు చేస్తున్నాయని తెలిపారు. మరోవైపు స్మార్ట్ మీటర్ల బిగింపు వల్ల ప్రతి వినియోగదారుడికీ రూ. 13 వేలకు పైగా అదనపు భారం పడబోతు ందన్నారు. రానున్న రోజుల్లో విద్యుత్తు బాగా అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజలు వినియోగించే స్థితి లేకుండా పోతోందని వాపోయారు. రాష్ట్రంలో 200 యూనిట్లు దాటిన ప్రతి ఇంటికీ స్మార్ట్ మీటర్లను బిగిస్తామని చేసిన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగాన్ని ప్రయివేట్ వ్యక్తులకు, సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నాల వ్యతిరేకంగా ప్రజానీకం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, నగర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రారెడ్డి, నగర కమిటీ సభ్యులు ఓబులేసు, ఫారుక్ హుస్సేన్, జమీల, వసంత కుమారి, రమాదేవి, మహబూబ్ తార, పవన్ కళ్యాణ్, గఢల శ్రీను, గోవింద, గౌస్ పీర్, వెంకటసుబ్బయ్య, షంషాద్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.



పాత బస్టాండ్ లో నిరసన తెలియజేస్తున్న సిపిఎం నాయకులు

రేపటి తరానికి చుక్కాని చరిత్ర : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగువారి చరిత్ర సుసపన్నం కావడానికి ఆంధ్రప్రదేశ్ మరింత పరిపుష్టిని సాధించడానికి, రేపటి తరానికి చుక్కానిలా ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ సెషన్లు ఉపయోగపడుతాయని యోగివేమన విశ్వవిద్యాలయం వి సి ఆచార్య మునగల సూర్య కళావతి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఎపిజె అబ్దుల్ కలాం గ్రంథాలయ ప్రాంగణంలో 45వ ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ సెషన్స్ లోకల్ సెక్రటరీ ఆచార్య కంకణాల గంగయ్య అధ్యక్షతన రెండు రోజుల సదస్సు శనివారం ప్రారంభమయ్యాయి. సదస్సు అధ్యక్షులు ఆచార్య కిరణ్ కాంత్ చౌదరి సభను సమన్వయం చేయగా వి సి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కడపకు మంచి చారిత్రక సంపద ఉందన్నారు. చింతకుంట రేఖాచిత్రాలు, గండికోట శిల్ప సంపద, వందేళ్ల కిందటి ఆలయాలు, దర్గా ఇలా ప్రతిది చారిత్రకంగా పేరొందినవేనన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పురాతన, ఆధునిక చారిత్రకుల ఆలంబనగా చరిత్ర కాంగ్రెస్ 45వ సెషన్సు నిలవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ చరిత్ర లేకుండా భవిష్యత్తు ఉండదన్నారు. పురాతన సమాచారం చాలా విలువైనదని వాటి ద్వారానే భవిష్యత్తు నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వక్తలు ప్రసంగించారు.

జిల్లా వ్యాప్తంగా 336 న్యాయ విజ్ఞాన సదస్సులు

కడప : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా 336 న్యాయ విజ్ఞాన సదస్సులు అందరి సహకారంతో నిర్వహించినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి, ఎస్. కవిత తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ వివిధ అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వశాఖల హోదాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు, వన్ స్టాప్ సెంటర్, దిశా పోలీస్, డిస్ట్రిక్ పంచాయతీ ఆఫీస్, ఉమెన్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, పారా లీగల్ వాలంటరీలు, మండల విద్యాశాఖ అధికారి, తదితరుల సహకారంతో సదస్సులు నిర్వహించామన్నారు.

లైంగిక వేధింపుల నిరోధానికి చర్యలు

కడప సిటీ : మహిళలపై లైంగిక వేధింపుల నిరోధానికి చర్యలు తీసు కునేందుకు వన్స్టాప్ కేంద్రం పని చేస్తోందని స్త్రీ, శిశు సంక్షేమ జిల్లా అధికారి ఎం.ఎన్. రాణి పేర్కొన్నారు. శని వారం స్థానిక వన్స్టాప్ సెంటర్లో మహి ళలపై లైంగిక వేధింపులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాల్య వివాహ నిరోధక చట్టం, బాల్య కార్మిక చట్టం, ఉచిత న్యాయసాయం, వయోవృద్ధుల చట్టాలు, లైంగిక వేధింపుల నిషేధంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఆపద సమయంలో దిశయాప్ను ప్రతి మహిళా, యువతీ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఇంకా 181, 100, చైల్డ్ హెల్ప్లైన్ 112, 1098 వంటివాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వన్స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని, జడ్ఎఎ జ్యోతి, మాధవిలతా, శారద, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధికారి

విసి మార్గదర్శకం

- వీడ్కోలు సభలో అధ్యాపక బృందం

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయాన్ని జాతీయ సంస్థల గుర్తింపు, పరిశోధనల్లో అభివృద్ధిలో మేటిగా నిలిపిన విసి ఆచార్య మునగల సూర్య కళావతి కృషి తమకు మార్గదర్శకమని విశ్వవిద్యాలయ అధ్యాపక బృందం కీర్తించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం టీచర్స్ అసోసియేషన్(యూట) ఆధ్వర్యంలో విసి పదవీ కాలం పూర్తి అయిన సందర్భంగా వీడ్కోలు సభ సర్ సివి రామన్ భవన్ లో నిర్వహించారు. యూట అధ్యక్షుడు డాక్టర్ ఎస్ వి కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి సుబోస్ చంద్ర , డాక్టర్ రియాజు న్నిసా సభా సమన్వయం చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య వైపి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మూడేళ్ల అనతి కాలంలోనే విశ్వవిద్యాలయాన్ని ప్రగతిలో పరుగులు పెట్టించిన ఘనత విసికి దక్కుతుందన్నారు. పూర్వపు కుల సచివులు ఆచార్య విజయ రాఘవ ప్రసాద్ సహకారం ఎంతో ఉందన్నారు. ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ హెల్త్ సెంటర్ కు అన్ని వస్తువులు కల్పించి వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారని, వసతిగృహాలన్నీ ఆధునికరించారని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులలా వైవీయూలోని ప్రతి ఒక్కరి సమస్యలను పరిష్కరించారన్నారు.

ఘనంగా కందుల రాజేశ్వరమ్మ పుట్టినరోజు వేడుకలు

కడప అర్బన్ : కందుల విద్యాసంస్థల కోశాధికారి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ 68వ పుట్టినరోజు వేడుకలు కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను కళాశాల స్టూడెంట్స్ క్లబ్, కల్చరల్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల మధ్య ఓపెన్ ఆడిటోరియంలో నిర్వ హించారు. ముందుగా కళాశాల ఎన్ ఎస్ ఎస్ విద్యార్థినీ, విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ చేసి వారికి 68వ పుట్టినరోజు శుభాకాంక్షలతో స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులచే సాంస్కృతిక నృత్యాలను తిలకించి సంతోషంగా వెలిబుచ్చారు. కార్యక్రమంలో కళాశాల మేనే జింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, కెఓఆర్ఎం ఇంజినీరింగ్ కళా శాల చైర్మన్ వెంకట శివారెడ్డి, సెక్రెటరీ లికిత రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి, వివిధ విభాగాల అధిపతులు, డీన్ లు, స్టూడెంట్ క్లబ్ కో-ఆర్డినేటర్ లీనా రాస్తాపూర్, కల్చరల్ కమిటీ కో-ఆర్డినేటర్ వీర శంకర్, ఎన్ఎస్ఎస్ విభాగం కో-ఆర్డినేటర్ సురేష్ బాబు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కందుల రాజేశ్వరమ్మ

ఎమ్మెల్యేకు సన్మానం

పోరుమామిళ్ల టౌన్ : బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధాను, పి. నాగార్జునరెడ్డిని రంగ సముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్రెడ్డి సన్మానించారు. గడపగడపకు వైసిపి కార్యక్రమం వందరోజుల పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పంచాయతీలోని సుందరయ్య కాలనీలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పిటిసి ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపిపి సి. బాషా, రాజశేఖర్, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

కడప అర్బన్ : పట్టాలు అందుకున్న విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పట్టుదలగా మరింత కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ పేర్కొన్నారు. కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఘనంగా తొలి స్నాతకోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. కడప జోన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బాబు, డాక్టర్ నాగలింగారెడ్డి, కళాశాల విద్య చీఫ్ అకౌంట్ ఆఫీసర్ బి. అనురాధ, యోగి వేమన యూనివర్సిటీ నామిని ప్రొఫెసర్ ఎం.వి శంకర్, రిటైర్డ్ ప్రొఫెసర్ జి.గులాం తారిక్, పి. అరుణ కుమారి హాజరయ్యారు. 2017- 20 సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసుకున్న దాదాపు 200 మంది విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను కళాశాల విద్య కమిషనర్ అందజేశారు. అన్ని గ్రూపులలో ఉత్తమ మార్కులు సాధించిన 15 మంది విద్యార్థులకు బంగారు పతకాలను అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుబ్బలక్ష్మి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థుల ఉన్నతి కోసం నిరంతరమూ శ్రమిస్తోందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు తమ ప్రథమ కర్తవ్యమని చెప్పారు. యూనివర్సిటీ నామిని ప్రొఫెసర్ శంకర్ మాట్లాడుతూ కోటిరెడ్డి కళాశాల తొలి స్నాతకోత్సవ వేడుకలలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదలకు వెంటనే పట్టాలు ఇవ్వాలి : వ్య.కా.స

ఒంటిమిట్ట : అర్హులైన పేదలందరికీ వెంటనే పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి. అన్వేష్ పేర్కొన్నారు. శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నరసయ్య ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదవ్యవసాయ కార్మికులకు పట్టాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములన్నీ బడా భూస్వాములకే కట్టబెడుతోందని, ఇది చాలా హేయమైన చర్య అని తెలిపారు. నర్సయ్య మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి 2050 సర్వే నెంబరులో ముకుందాశ్రమం దగ్గర పేద వ్యవసాయ కార్మికులు వ్యవసాయం చేసుకోవడానికి కంపచెట్లు తొలగించి చదును చేసుకున్నా అధి కారులు పట్టాలు ఇవ్వాలని వాపోయారు. గతంలో పలుమార్లు తహశీల్దార్కు, ఆర్డిఒకు వినతి పత్రాలు అందజేసినా స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యవసాయ కార్మికులు పట్టాలిప్పించాలని కోరారు. కార్యక్రమంలో రాము, హరి వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి పట్టిన పీడను తొలగించుకుందాం : టిడిపి


చింతకొమ్మదిన్నె : రాష్ట్రానికి పట్టిన పీడను రాబోయే ఎన్నికల్లో తొలగిం చుకుందామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తానరసింహారెడ్డి పేర్కొన్నారు. మం డలంలోని బుసిరెడ్డిపల్లె పంచాయతీ అప్ప రాజు పల్లె, బుసిరెడ్డిపల్లె గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పుత్తా నరసింహారెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రస్తుత ప్రభుత్వంలో జరుగుతున్న భూ కబ్జాలు, పెంచిన పన్నులు, ప్రజలపై భారాలను వివరించారు. రాష్ట్రంలో సైకో పాలన జరుగుతుందని ప్రతిపక్షాలను అణగదొక్కే కార్యక్రమాలు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు ఆటకెక్కించి చేపడుతున్నారని చెప్పారు. వెంటనే ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి.వి సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం మోహన్ బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ భాస్కర్ తెలుగు యువత అధ్యక్షులు గోపాల్ రెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, స్థానిక నాయకులు శీను,కృష్ణయ్య, ఐటిడిపి ఛాంపియన్ దర్బార్ బాష పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న పుత్తానరసింహారెడ్డి

వైవీయూ రిజిస్ట్రార్కు వినతిపత్రం

కడప : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సంక్రాంతి సెలవులు ఈనెల 9 నుంచి 18 వరకు ఇవ్వాలని కోరుతూ శనివారం జిసిటిఎ జిల్లా అధ్యక్షులు శశికాంత్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ నీలయ్య, జోన్-4 ప్రెసిడెంట్ డాక్టర్ కృష్ణారెడ్డి, కోశాధికారి డాక్టర్ రామకృష్ణ వైవియు రిజిస్ట్రార్ వెంకట సుబ్బయ్యను కలిసి వినతిపత్రం అంద జేశారు. అందుకు రిజిస్ట్రార్ సాను కూలంగా స్పందించి అంగీకరిం చడంతో ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిసిటిఎ 2023 కేలండర్ను రిజిస్ట్రార్ ఆవిష్కరించారు.




వినతిపత్రం అందజేస్తున్న జెసిటిఎ ప్రతినిధులు

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

కడప అర్బన్ : గత ప్రభుత్వం ఫాతిమా కళాశాల విద్యార్థులకు అన్యాయం చేశారని డిప్యూటీ సీఎం అంజాద్ బాష మాట్లాడడం సిగ్గుచేటని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే మంచిందని పేర్కొన్నారు. ఫాతిమా కాలేజ్ విద్యార్థులకు అండగా నిలిచింది తెలుగుదేశం పార్టీ అని తెలిపారు. 2018 లో సీటు కోల్పోయిన విద్యార్థులకు రూ. 13 కోట్లకు జీవో ఇచ్చిన విషయం మరిచిపోయారని పేర్కొ న్నారు. తన సొంత ఖర్చులతో విద్యార్థులను ఢిల్లీ తీసుకెళ్లి సమస్యను కేంద్ర మంత్రి దృష్టి కి తీసుకువెళ్లామని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నుంచి ఫీజులు చెల్లించిందని పేర్కొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

కడప : ప్రమాదంలో కాలు పోగొట్టుకున్న సుబ్బరాయుడు అనే వ్యక్తికి జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సాయం అందజేశారు. చింతకొమ్మదిన్నె మండలం కృష్ణాపురంలో నివాసముంటు బాధితుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలు పోగొట్టుకున్నాడు. స్పందించిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తుల లింగమూర్తి వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాగరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పల శివ ఆధ్వర్యంలో వారికీ చేదోడుగా 15 వేలు రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా డొక్కు సుబ్బారాయుడు దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.



ఆర్థిక సాయం చేస్తున్న బిసి నాయకులు

ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేస్తే

ప్రజలు తిరగబడతారు

- జీవో నంబర్ 1 రద్దు చేసే వరకూ పోరాటం
- అంబేద్కర్ విగ్రహ వద్ద ఆందోళనలో అఖిలపక్ష నేతల హెచ్చరిక
- చేతికి సంకెళ్లతో వినూత్న నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

వైసిపి ప్రభుత్వం పౌరహక్కులకు భంగం కలిగించే విధంగా రాజ్యాంగ హక్కులు కాల రాస్తే పుట్టగతులు ఉండవని, ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేస్తే ప్రజలు తిరగబడతారని, రాబోయే ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిస్తారని అఖిలపక్ష నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వులు జీవో నంబర్ రద్దు చేయాలని శనివారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన కార్యక్రమ ంనిర్వహించారు. నల్ల చొక్కాలు ధరించి చేతికి సంకెళ్లతో వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చేందుకు పాదయాత్రలు, ఓదార్పు యాత్రలు రోడ్ షో లు, రోడ్లపై సభలు, సమావేశాలు దీక్షలు చేయచ్చు కానీ ఆయన అధికారంలో ఉంటే ప్రతిపక్షాలు ప్రజలు చేయకూడదా? రాజ్యాంగం ఆయన ఒక్కనికే హక్కులు కల్పించలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు 151 స్థానాలు కట్టబెడితే సివిల్ సర్వీస్ ఐఎఎస్ అధికారుల సేవలు, సలహాలు ఉపయోగించి పరిపాలన చేయకుండా వందల మందిని సలహా దారులుగా నియమించుకుని పరిపాలనను నాశనం చేశారన్నారు. రాష్ట్రంలోని ప్రజా సమస్యలను గాలికి వదిలేసి మైన్, వైన్, ల్యాండు, శాండు మాఫియా అధికార పార్టీ అండదండలతో యదేచ్ఛగా దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ రాబట్టడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చ కపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ జలకళ పథకం కింద ఉచిత బోర్లు వేయిస్తా అని చెప్పి చేయక పోగా వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టటం, నిత్యవసర ఇతర వస్తువులు ధరలు పెంచడం, చెత్త పన్ను విధించడం, పింఛన్లు తొలగించడం, రైతులకు గిట్టబాటు ధర కల్పించకపోవడం , విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించడం , నిరుద్యోగులను ఉద్యోగాలూ ఇవ్వకపోవడం, కడప ఉక్కు పరిశ్రమ నిర్మిచక పోవడం ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రదర్శనలు, సభలు సమావేశాలు, నిరసనలు నిషేధిస్తూ రాజ్యాంగ విరుద్ధమైన జీవోను తీసుకురావడం దారుణమని వాపోయారు. బ్రిటిష్ కాలం నాటి పోలీసు చట్టం 1861 అనుసరించి పోలీసు చట్టం 30 ప్రకారం ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. తక్షణమే జీవో నెంబర్ ఒకటిని వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఇంటింటికి జగన్మోహన్ రెడ్డి నియంత్రత్వ విధానాలను తీసుకెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. ఓబులేసు, జిల్లా కార్యదర్శి గాలి. చంద్ర, తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ , అమీర్ బాబు, లక్ష్మిరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎస్. ఎ. సత్తార్, సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, సిఆర్వి ప్రసాద్,రాము, బిఎస్పి నాయకులు గుర్రప్ప, లోక్ సత్తా నాయకులూ కృష్ణా , జనతాదళ్ రాష్ట్ర నాయకులు ప్రతాపరెడ్డి , సిపిఐ(ఎం లిబరేషన్) జిల్లా కార్యదర్శి జి రమణయ్య, ఎస్సీఎస్టీ మానవ హక్కుల నాయకులు జెవి రమణ, ఎంఆర్ఎఫ్ దస్తగిరి మహిళా సంఘం ఐఎన్ సుబ్బమ్మ, పద్మ, లక్ష్మీదేవి, రైతుసంఘం బాలచంద్రయ్య, జయన్న, రామోహన్ రెడ్డి, నారాయణ, మల్లికార్జున, కొండయ్య, పక్కీరప్ప, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.



అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలియజేస్తున్న అఖిలపక్ష నాయకులు

జనాన్ని దోచి ధనికులకు పెడుతున్న బిజెపి

కడప అర్బన్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జనాన్ని దోచి ధనికులకు తెచ్చి పెడుతూ ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ విమర్శించారు. శనివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో చంద్రారెడ్డి అధ్యక్షతన సిపిఎం నగర కమిటీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజల పైన భారాలు వేసి, డబ్బులు దోచి, బిజెపికి ఎన్నికల నిధులు సమకూర్చే అంబానీ, ఆదాని, లాంటి స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు తెచ్చి పెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాల సంక్షేమ నగదు బదిలీ పథకాలకు నిధులు కోసం కేంద్రం ఇచ్చే అప్పుల పై ఆధారపడుతున్నారని విమర్శించారు. అవసరమైన అప్పులు దొరక్క ఒక్కొక్క నవరత్నం రాలిపోతూ వస్తోందని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వానికి, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ఒక నిర్దిష్టమైన ప్రణాళిక లేదని ఎద్దేవ చేశారు. ప్రజలలో ప్రభుత్వంపై వస్తున్న అసంతృప్తిని పరిష్కరించుకోలేక, ప్రతిపక్షాలు, ప్రజలకు నాయకత్వం వహించలేక, ఐపిసి 144 సెక్షన్, 30 యాక్ట్, 1861 పోలీసు యాక్ట్ అమలుకు ప్రభుత్వం ప్రత్యేక జీవో తీసుకొస్తోందని వాపోయారు. ఇది వైసీపీ ప్రభుత్వ పునాదులను కదిలించి వేసే ప్రజా ఉద్యమానికి బాటలు వేస్తుందని వారు హెచ్చరించారు. ప్రజాస్వామిక, ప్రజా నిర్బంధ పోలీస్ చట్టాలను వెంటనే రద్దు చేసే వరకు ఉద్యమాలు నిర్వహించాల్సిన బాధ్యత సిపిఎం ప్రతి కార్యకర్త పైన ఉందన్నారు. వైసిపి, టిడిపి, జనసేనలు బిజెపికి దన్నుగా ఉండడం రాష్ట్ర ప్రజలకు నష్టతాయకమన్నారు. సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి ఏ.రామ్మోహన్, కమిటీ సభ్యులు జమీలమ్మ, ఫరూక్ , ఓబులేసు, కళ్యాణ్, వెంకటసుబ్బయ్య, తార, అంజలి సిపిఎం సభ్యులు పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ కేలండర్ ఆవిష్కరణ

పోరుమామిళ్ల టౌన్ : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో కడప జిల్లా కమిటీ ముద్రించిన 2023 న్యూ ఇయర్ కేలండర్ను డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని ఆవిష్కరించారు. పోరుమామిళ్లలో డివైఎఫ్ఐ నాయకులతో కలిసి శనివారం ఆయన క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కన్వీనర్ ఎం. సుందరయ్య, నాయకులు నాగార్జున, సురేంద్ర, సాయి తేజ, విజయ్, సాయి కుమార్ పాల్గొన్నారు. **ఎంబిసి కేలండర్.. కడప అర్బన్:** ఎంబిసి రాష్ట్ర అధ్యక్షులు సుంకేసుల బాదుల్లా ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, ఎంపీ అవినాష్ రెడ్డి, యువ నాయకులు అహ్మద్ బాషా వేర్వేరు చోట్ల ఎంబిసి కేలండర్ను ఆవిష్కరించారు. కార్యక్రమం లో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఓ. రసూల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగిడాలా పెద్దన్న, ప్రచారకార్యదర్శి కుళాయిప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. మహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దయ్య, నగర అధ్యక్షులు అలీ బాషా, నగర ఉపాధ్యక్షులు మల్లి, శేఖర్, బాబు, మస్తాన్, బాబయ్య పాల్గొన్నారు.



కేలండర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సిఎం

ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలి : ఎమ్మెల్యే

కాశినాయన : అందరూ సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని స్త్రీ శక్తి భవనంలో కొత్త పింఛన్లను ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. అర్హులై ఉండి ఎవరికైనా పింఛను రాకపోతే తమదృష్టికి తీసుకురావాలని, వెంటనే మంజూరు చేయిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ముజఫర్ రహీం, తహశీల్దార్ రామచంద్రుడు సిబ్బంది పాల్గొన్నారు.

11న కాంగ్రెస్ జిల్లా సర్వసభ్య సమావేశం

'కడప : జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సర్వ సభ్య సమా వేశం ఈనెల 11న నిర్వహిం చనున్నామని, ముఖ్య అతిథి గా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు హాజరుకానున్నారని జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, నగర అధ్యక్షులు వై.విష్ణు ప్రీతంరెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇంకా సమావేశానికి ఏఐసీసీ సెక్రెటరీ సిడి మేయ్యప్పన్, పీసీసీ మీడియా చైర్మన్ డాక్టర్ నరెడ్డి తులసిరెడ్డి , రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షుడు మధు, హాజరుకానున్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్, నగర ఉపాధ్యక్షుడు మధు రెడ్డి, నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆనంద్, బీసీ నేత కణతల ప్రసాద్, జిల్లా కార్యదర్శి సూర్యుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు

ప్రతి నెలా జీతాలు అడుక్కోవాలా? : యుటిఎఫ్

బద్వేలు : ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రతినెలా ప్రభుత్వం నుంచి జీతాలు అడుక్కోవాలా అంటూ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. శనివారం ఉదయం బద్వేల్లోని మండల విద్యా శాఖాధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు నెలంతా చేసిన పనికి ఒకటో తేదీ జీతాలు చెల్లించకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదన్నారు. ప్రతి నెలా ఉద్యోగ, ఉపాధ్యాయులు జీతాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. చేసిన పనికి కూలి ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఒకటో తేదీ జీతాలు ఇవ్వకపోవడం వల్ల బ్యాం కులలో రుణాలు తీసుకున్న ఉద్యోగ,ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారన్నారు. ఇఎంఐలు సకాలంలో చెల్లించకపోతే పెనాల్టీలు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నెలలో మొదటి వారం ముగిసినా ఇంకా 50 శాతం మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించలేదని ఆరోపించారు. ఫేషియల్ యాప్ ప్రవేశపెట్టి ఒక్క నిమిషం విధులకు ఆలస్యమైనా జీతాలు కట్ చేస్తామని, చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని వాపో యారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులపై కక్ష సాధింపులు మానుకొని ప్రతి నెల ఒకటో తేదీ జీతాలు చెల్లించాలని లేనిపక్షంలో ప్రభుత్వం తగు మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.శశిధర్ కుమార్, బద్వేలు మండల అధ్యక్షులు టి.శివ ప్రసాద్, జిల్లా కౌన్సిలర్ సభ్యులు పి.చక్రపాణి, ఎన్.సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాదన విజయకుమార్

సాహిత్య పోరాటం చేసిన మేటి 'పల్లేటి'

కడప అర్బన్ : నాటక ప్రక్రియలో శతాధిక నాటకాలు రాసిన పల్లేటి లక్ష్మీ కులశేఖర్ అవిశ్రాంత నాటక సాహిత్య పోరాటం చేసిన మేటి అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. అజో-విభో కందాళం ఫౌండేషన్, కళారాధన సాంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నంద్యాలలోని మున్సిపల్ టౌన్హాల్లో శనివారం ఉదయం 30వ వార్షిక సభలు నిర్వహించారు. అందులో భాగంగా ప్రసిద్ధ నాటకకర్త పల్లేటి లక్ష్మీ కులశేఖర్కు నిర్వాహకులు విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన పురస్కారంతోపాటు 50 వేల రూపాయల నగదును అందజేసి ఘనంగా సత్కరించారు.

అసహనం

ప్రజా'దృష్టి'

జిల్లాలో అసహనం హద్దులు మీరుతోంది. ఉప ముఖ్యమంత్రి ఎస్,బి.అంజాద్బాషా గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సుమారు ఆర్నెళ్లుగా ఇంటింటికీ తిరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వం ఆయా శాఖల ఆడిట్ నిర్వహణలో భాగంగా సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్ నిబంధనల పేరుతో సుమారుగా 12 వేల మంది పింఛన్దారులకు నోటీసులు జారీ చేసింది. ఇందులో అర్హులైన వారి పేర్లు ఉంటే ఆధారాలు చూపిస్తే పింఛన్ తొలగించ బోమని పేర్కొంది. ఇటీవల ఉప ముఖ్యమంత్రి అంజాద్బాషా గడపగడపకూ ప్రభుత్వ కార్యక్రమం పేరుతో ఇంటింటికీ తిరుగుతున్న క్రమంలో ఓ దళిత సంఘం నాయకుడు పింఛన్ల తొలగింపును ప్రశ్నించడంతో సహనం కోల్పోయి దుర్భాషలాడడం విస్మయాన్ని కలిగించింది. అధికారంలో ఉన్న నాయకులు ప్రతిపక్షాలు మొదలుకుని ప్రజాసంఘాలు సంధించే ప్రశ్నలు, విమర్శలకు ఓపికగా సమాధానం చెప్పాలి. ఓపికతో సమాధానం చెప్పకుండా దుర్భాషలకు దిగడం శోభనివ్వదనే సంగతిని గుర్తెరిగి నడుచుకోవాల్సిన అవసరం ఉంది. ఎంతో సౌమ్యునిగా, మర్యాదస్తునిగా పేరు గాంచిన ఉప ముఖ్యమంత్రి సహనం కోల్పోవడానికి కారణాలు ఏమి అయినప్పటికీ హుందాతనాన్ని కోల్పోవడం విస్మయాన్ని కలిగించింది. అవతలి వ్యక్తి సహనానికి పరీక్ష పెట్టినప్పటికీ ఓపికగా తగిన సమాధానం చెప్పాల్సి ఉంది. ఎందుకంటే అధికారంలో ఉన్న పాలకులకు సహనాన్ని ఆభరణంలా ధరించాలి. లేనిపక్షంలో పాలనకు నైతికంగా అర్హత కోల్పోయినట్లు అవుతుందని సంగతిని గ్రహించాల్సి ఉంది. నెల్లూరు జిల్లాలోని ప్రకాశం జిల్లాలోని కందుకూరులో ప్రతిపక్ష నేత చంద్రబాబు ర్యాలీ, సభల్లో తొక్కిసలాట కారణంగా కొంత మంది మృతి చెందడం ఆందోళన కలిగించింది. గుంటూరు జిల్లాలో సంక్రాంతి కానుకల పంపిణీ కార్యక్రమానికి ప్రతి పక్షనేత హాజరైన నేపథ్యంలో తొక్కిలాట చోటుచేసుకున్న ఘటనలో కొందరు మృతి చెందడం విస్మయాన్ని కలిగించింది. చిత్తూరు జిల్లా కుప్పంలోనూ ప్రతిపక్ష నేత ర్యాలీ, సభలను అడ్డుకోవాలను కోవడం విస్మయాన్ని కలిగించింది. ఇటువంటి సంఘటనలను ఆధారం చేసుకుని జిఓ నెంబర్-1 ఉత్తర్వులను జారీ చేసి రహదారులపై ర్యాలీలు, సభలను నిషేధించడం విస్మయాన్ని కలిగించింది. ఇదే సమయంలో అధికార పార్టీ నేతలు ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించడంలోని హేతుబద్ధత ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ల తొలగింపు నోటీసులు ఇవ్వడం, సభలు, ర్యాలీలు, సమావేశాలు నిషేధించడం వంటి అసహన నియంతృత్వ పోకడలకు పాల్పడడం విస్మయాన్ని కలిగించింది.ఏదేమైనప్పటికీ ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతుల్లో పాలన సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడపప్రతినిధి

అమ్మవారికి ఎమ్మెల్యే కిలో వెండి వితరణ

ప్రజాశక్తి - ఖాజీపేట



ఆలయ చైర్మన్‌కు వెండిని అందజేస్తున్న నాయకులు

స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయానికి మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి కిలో వెండి వితరణ చేశారు. గతేడాది దసరా ఉత్సవాలకు ఎమ్మెల్యే హాజరై కన్యకా పరమేశ్వరి అమ్మవారికి కిలో వెండి వితరణ అందజేస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు శనివారం ఎపిఐఐసి డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, స్థానిక నాయకులు బిఎంబి బాషా ఆలయ చైర్మన్ దరిశ గంగిశెట్టికి వెండిని అందజేశారు. కార్యక్రమంలో మైదుకూరు మార్కెట్ యార్డ్ మెంబెర్ ఎలిశెట్టి రఘు, ఆలయ కమిటీ సభ్యులు తాత నరసింహ, ఎలిశెట్టి చక్రపాణి, గాధంశెట్టి సుబ్రహ్మణ్యం, కుప్పం సుబ్బరాజా, మాకం విజ్జి, సుంకు శ్రీనివాసులు, గాధంశెట్టి సురేష్, దరిశ రాఘవ, ఎలిశెట్టి సత్యం, ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేడు యాదవుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎంజి ఆటో నగర్, ప్యారడైజ్ కళ్యాణ మండపంలో యాదవుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వహిస్తున్నారు. ఆ మేరకు చల్లా రాజగోపాల్ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాడు అఖండ భారత రాజ్యాన్ని నిర్మించి, పాలించి కీర్తిని, ఖ్యాతిని, ఘనతను ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన యాదవ వంశ శ్రీకృష్ణుని వారసులమన్నారు. రాష్ట్రంలో సుమారు 75 లక్షల మంది జనాభా ఉన్న యాదవులు నవ్యాంధ్రప్రదేశ్‌లో దయనీయ స్థితిని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో బాగా వెనుకబడి ఉన్నామన్నారు. యాదవుల హక్కుల కోసం పోరాటానికి సిద్ధపడాలని జిల్లా యాదవ పెద్దలు, రాష్ట్ర జాతీయ యాదవ నాయకులమంతా నిశ్చయించుకున్నామన్నారు. జిల్లాలోని యాదవ ప్రముఖులు, ఉద్యోగులు, విద్యార్థి యువజనులు, మహిళలు, కళాకారులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చల్లా కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - చక్రాయపేట

విద్యుత్ సబ్ స్టేషన్ల మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఎఇ ఆర్.ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నాగులగుట్టపల్లి, సిద్దారెడ్డిగారిపల్లి, కుప్పంరాజుపల్లి సబ్ స్టేషన్‌లలో మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 8.45 నుంచి ఉదయం 10.45 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

ఎంపిడిఒగా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కొండాపురం

కొండాపురం ఎంపిడిఒగా పి.శ్రీనివాసరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇదే కార్యాలయంలో కొంత కాలంగా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేస్తుండేవారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపిడిఒ ఉద్యోగోన్నతిపై వెళ్లారు. ఆ స్థానంలో శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కార్యాలయంలో ఇఒపిఆర్‌డి పి.శశిధర్‌రెడ్డి, సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు.



ఎంపిడిఒను సన్మానిస్తున్న సిబ్బంది

ప్రాసెసింగ్ యూనిట్ రైతులకు ఉపయోగకరం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక బ్రాహ్మణపల్లిలో నిర్మాణంలో ఉన్న అరటి ప్రాసెసింగ్ యూనిట్ పనులు దాదాపు పూర్తికానున్నాయని ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ హార్టికల్చర్ ఆఫీసర్ జి.అజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అజయ్‌కుమార్ మాట్లాడుతూ పూర్తయిన తర్వాత రైతు సంఘానికి నిర్వహణ బాధ్యతను అప్పగిస్తామన్నారు. అరటి ప్రాసెసింగ్ యూనిట్‌ను రైతు సంఘం అయిన పులివెందుల హార్టికల్చర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ స్వయంగా నడుపుకొంటూ, వారు పండించే పంటలకు మంచి ధరలు ఎలా సంపాదించుకోవాలో సూచనలిచ్చారు. ఈ ప్రాసెసింగ్ యూనిట్‌లో డ్రయిడ్ హనీ బనానా, బనానా పౌడర్, బనానా స్టెమ్ జ్యూస్, బనానా ఫైబర్ బేస్డ్ ప్రొడక్ట్స్ తయారు చేసుకునే మెషినరీ సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాసెసింగ్ యూనిట్ మొత్తం ఖర్చు రూ.4కోట్లు అవుతుందన్నారు. ఖర్చు మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ అనిల్‌కుమార్, సునీల్‌బాబు స్టేట్ కో –ఆర్డినేటర్, రైతు సంఘ ప్రతినిధులు బలరామిరెడ్డి, రైతులు ఉన్నారు.

వసతి గృహాలకు అద్దెలు పెంచడం శోచనీయం

- టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

తిరుమలలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన వసతిగృహాలకు పెద్ద ఎత్తున అద్దెలు పెంచడం శోచనీయమని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి తెలిపారు. తిరుమల కొండపై ఉన్న వసతి గహాలకు టిటిడి అధికారులు అమాంతంగా అద్దె పెంచడంతో శనివారం స్థానిక వృషభాచలేశ్వర దేవస్థానంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహానికి టిడిపి నాయకులు వినతిపత్రమిచ్చారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఆర్‌వి రమేష్, మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్, పూల అల్లాబక్ష్, ఇలియాస్, ఈశ్వరయ్య, డక్కా రమేష్, సైఫూలా, మహబూబ్ షరీఫ్, యాసిన్, యుగంధర్, వెంకటయ్య, మారుతి, మెకానిక్ శ్రీను, మారుతి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సాంబశివారెడ్డి (57) మృతి చెందినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మండల పరిధిలోని సుంకేసుల గ్రామానికి చెందిన సాంబశివారెడ్డి ఇంటివద్ద నుండి శుక్రవారం సాయంత్రం అయ్యప్ప స్వామి దేవాలయానికి వెళుతుండగా, ఎర్రగుంట్ల వైపు నుండి వస్తున్న లారీ సాంబశివారెడ్డిని వెనక వైపు నుండి ఢీకొంది. దీంతో తీవ్ర రక్త గాయాలయ్యాయి. అనంతరం 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుండి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీకొని మరొకరు..

పులివెందుల రూరల్:

పట్టణంలోని హెలిప్యాడ్ సమీపంలో కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ముచ్చుమర్రి పవన్‌కుమార్ యాదవ్(19) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో వెళుతున్న పవన్‌కుమార్, వినయ్ కుమార్‌రెడ్డిని తొండూరు మండలం మల్లెల నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ఉన్న పవన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. వినయ్‌కుమార్‌రెడ్డికి గాయాలయ్యాయి. కారులో ఉన్న చందన, నాగూరుబాషాకు స్వల్ప గాయాల య్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పవన్‌కుమార్ మృతదేహాన్ని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కంపచెట్లను తొలగించరూ..!

ప్రజాశక్తి - ముద్దనూరు

జమ్మలమడుగు–ముద్దనూరు రహదారిలోని రైల్వే గేట్ సమీపం వద్ద ఉన్న వంతెనను అల్లుకుంటున్న కంపచెట్లను తొలగించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు. వంతెనపై కంపచెట్లు ఏపుగా పెరిగి రోడ్డుపైకి అడ్డుగా వస్తున్నాయి. ఈ మార్గాన ప్రయాణించేవారు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. బస్సులో ప్రయాణించే సమయంలో కంపచెట్లు కిటికీలోంచి తగులుకుంటున్నాయని వాపోతున్నారు. అంతేకాక వాహనదారులు, పాదచారులు కూడా ఈ కంపతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్‌బి డిఇ కార్యాలయం ఇక్కడే ఉంది. డిఇ, ఎఇ సిబ్బంది ఉన్నారు. సంబంధిత అధికారులు అప్పుడప్పుడు ఆర్అండ్‌బి పరిధిలోని రహదారులను పరిశీలించి, రోడ్డుకు ఇరువైపులా అడ్డుగా పెరిగిన కంప చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. వీటితో పాటు ఏళ్ల తరబడి రోడ్లపై ఏర్పడిన గుంతలను కూడా పూడ్చాలని సూచిస్తున్నారు. యూనియన్ బ్యాంకు వద్ద పెద్దగా ఏర్పడిన గుంతల వల్ల ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడిపోతున్నారు. గుంతలకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు స్పందించి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా అడ్డుగా ఉన్న కంప చెట్లు తొలగించాలని, గుంతలకు మరమ్మతులు చేయాలని వాహనదారులు ప్రయాణికులు, ప్రజలు, స్థానికులు కోరుతున్నారు.



వంతెనపై అల్లుకుపోతున్న కంపచెట్లు

అస్మదీయులకు దోచే పథకమే సలహాదారుల నియామకం

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి జగన్ అస్మదీయులకు దోచి పెట్టే పథకమే ప్రభుత్వ సలహాదారుల నియామకమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. స్థానికంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఒక వైపు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంటే.. మరో వైపు లెక్కకు మించి సలహాదారులను నియమిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం గర్హనీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక సంక్షోభం కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదన్నారు. విశ్రాంత ఉద్యోగులకు ఫించన్లు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ సలహాదారులు కాదు స్వాహాదారులని ఆరోపించారు. అధికారపార్టీ నాయకులకు ఉపాధి హామీ పథకంలా సలహాదారుల నియామకం చేపడుతున్నారని తెలిపారు. ఇది అధికార దుర్వినియోగానికి పరాకాష్టగా ఆయన పేర్కొన్నారు. సలహాదారులు స్వచ్ఛందంగా రాజీనామా చేయడం సమంజసంగా ఉంటుందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులను నవరత్నాలకుగానీ, మరే ఏ పథకాలకుగానీ మళ్లించకూడదని హైకోర్టు వ్యాఖ్యానించడం గమనార్హమన్నారు. గతంలో నీలం సంజీవరెడ్డి, నేదురుమల్లి జనార్ధనరెడ్డి ప్రభుత్వాలపై హైకోర్టు ప్రతికూల వ్యాఖ్యలు చేసినందుకు నైతిక విలువలు పాటించి ముఖ్యమంత్రి పదవికి వారు రాజీనామా చేశారని తులసిరెడ్డి గుర్తు చేశారు. ఒక్కో సలహాదారునికి నెలకు దాదాపుగా రూ.5లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. నైతిక విలువలు పాటించి జగన్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



సంప్రదాయ వస్త్రధారణతో భోగిమంటలు వేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. విద్యార్థులు ఆనందోత్సాహాలతో సంప్రదాయ దుస్తులు ధరించి ఆయా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులుగా సిబిఐటి కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, ప్రెసిడెంట్ మాధవి, సిఇఒ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ నేడు మన ప్రాచీన సంప్రదాయాలు అంతరించి పోతున్నాయని, వాటిని విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. సంప్రదాయాన్ని తెలియజేడమే కాక ఐకమత్యాన్ని పెంపొందిస్తుందన్నారు. సంప్రదాయ వస్త్ర ధారణ, రుచులు, నూతన కుటీరాలు, రంగవల్లులు, హరిదాసుల వేషధారణలతో విద్యార్థులు అలరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్టాల్స్ నిర్వహించి, వివిధ రకాల సంప్రాదాయ వంటకాల రుచులతో అలరించారు. హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులకు సంప్రదాయ ఆటల పోటీలు నిర్వహించారు. గెలిచిన వారికి పాఠశాల వార్షికోత్సవం రోజు బహుమతులు అందజేస్తారని యాజమాన్యం తెలిపింది. కార్యక్రములో విద్యార్థులు చేసిన కర్రసాము ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని జయప్రదం చేయడం పట్ల స్కూల్ డైరెక్టర్ లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపల్ రాధామణి, కె.నాయర్ హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కడప ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో జరిగే రోడ్డు విస్తరణ పనులకు ఇంటి యజమానులు సహకరించాలని కడప ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డి కోరారు. శనివారం స్థానిక పులివెందుల రోడ్డులో సమస్యగా ఉన్న కందుల కాంప్లెక్స్ భవనాలను కందుల ఎడ్యుకేషన్ యజమాని చంద్రఓబుల్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. అలాగే ఐటిఐ ప్రాంతంలో కూడా రోడ్డు విస్తరణపై పరిశీలించారు. రోడ్డు భవనాల శాఖ, రెవెన్యూ అధికారులతో చర్చించారు. రోడ్డు విస్తరణలో తమకు అన్యాయం జరిగిందని ఆర్‌డిఒ దృష్టికి చంద్రఓబుల్‌రెడ్డి తెచ్చారు. రోడ్డును బట్టి మార్కింగ్ వేయడం జరిగిందని, రోడ్డు భవనాల శాఖ ఎఇ వెంకట రమణ ఆర్‌డిఒకు వివరించారు. న్యాయం చేస్తామని రోడ్డు పనులు జరిగేందుకు సహకరించిన పత్రాలను రెవెన్యూ అధికారులకు సమర్పించాలని ఆర్‌డిఒ కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్వేయర్ శివారెడ్డి, రెవెన్యూ , గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో దొంగ అరెస్టు : సిఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

స్థానిక కెనరా బ్యాంకులో మంగ ళవారం ఉదయం చోరీ జరిగిన ఘటనలో ఆ బ్యాంక్ మేనేజర్ ఈశ్వర య్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు మొద లెట్టారు. నాలుగు రోజుల్లో పోలీసులు చాకచక్యంగా దొంగను పట్టు కోవడంతో ప్రజలు పోలీసులను అభినందిస్తున్నారు. వివరాల్లోకెళితే.. ప్రొద్దుటూరు రోడ్డులోని కెనరా బ్యాంక్‌లో దొంగతనం మైల వరం మండలం వేపరాల గ్రామానికి చెందిన వరద బాలమురళి చేసినట్లు అర్బన్ సిఐ సదాశివయ్య తెలిపారు. బాలమురళి బిఇడి పూర్తి చేసి, ఉద్యోగం లేక ఇంటి వద్ద మగ్గం చేసుకుంటూ ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌కు అల వాటు పడ్డా డని సిఐ తెలిపారు. పది లక్షల రూపాయల అప్పు చేసినట్లు ఆయన తెలి పారు. అప్పు ఇచ్చినవారు ఒత్తిడి చేయగా దొంగతనం చేసినట్లు నిందితుడు తెలిపాడని ఆయన పేర్కొన్నారు. అందిన సమాచారం మేరకు శని వారం ఉదయం ప్రొద్దుటూరు రోడ్డులోని ఈశ్వర్ పెట్రోల్ బంక్ వద్ద బాల మురళిని పోలీసులు అరెస్టు చేసినట్లు అర్బన్ సిఐ వివరించారు. అప హరణకు గురైన రెండు కంప్యూటర్లు, స్కానర్, మానిటర్ వస్తువులను రికవరీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ సుబ్బారావు, పోలీసులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న అర్బన్ సిఐ సదాశివయ్య

ఇంటి పనులు వేగవంతం చేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి - వేంపల్లె

జగనన్న కాలనీలో లబ్ధిదారులు ఇంటి పనులను వేగవంతం చేసేందుకు గ్రామ సచివాలయాల సిబ్బంది కృషి చేయాలని ఎంపిపి లక్ష్మిగాయత్రి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఒఎస్‌డి ఆదేశాల మేరకు శనివారం గ్రామ సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తున్న లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సకాలంలో పూర్తయ్యేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కోరారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు కూడా జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేందుకు కృషి చేయాలని కోరారు. మండల స్పెషల్ ఆఫీసర్ రవీంద్రనాథ్‌రెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిడిఒ మల్లి కార్జునరెడ్డి, హౌసింగ్ ఎఇ సుకుమార్‌రెడ్డి, ఎంపిటిసిలు, మణి గోపాల్ రెడ్డి, రాజ్ కుమార్, సర్పంచులు, వార్డ్ మెంబర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి లక్ష్మిగాయత్రి

నేడు వంతెన పనులకు భూమిపూజ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్థానిక రామేశ్వరంలోని పెన్నానదిపై రూ.53 కోట్లతో హైలెవెల్ వంతెన పనులకు ఆదివారం భూమిపూజ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సిఎం జగన్ రూ.520 కోట్లతో ఇచ్చిన హామీ తెలిసిందేనని తెలిపారు. ఇప్పటికే కూరగాయల మార్కెట్ ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. హైలెవెల్ వంతెన పనులకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. వంతెన పూర్తయితే ఆర్‌టిపిపికి వెళ్లేందుకు, 8వేల పక్కాగృహాలు నిర్మితమవుతున్న జగనన్న కాలనీకి వెళ్లేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. రామేశ్వరం రైతులకు, వ్యవసాయ కూలీలకు కూడా అనుకూలంగా ఉంటుందన్నారు. వర్షాకాలంలో పంటనష్టాన్ని నివారించుకోవచ్చన్నారు. ప్రొద్దుటూరు నుండి బెంగళూరు వెళ్లేందుకు 15కిలోమీటర్లు దూరం తగ్గుతుందని ఎమ్మెల్యే వివరించారు.

12న వాహనాలకు వేలం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 12న వేలంపాట నిర్వహిస్తున్నట్లు జమ్మలమడుగు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కెఎస్ లత ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తిగలవారు తమ ఆధార్ కార్డు, ఏదైనా ప్రూఫ్ తీసుకొని వేలంలో పాల్గొనవచ్చు అని ఆమె తెలిపారు.

టిడిపితోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి

ప్రజాశక్తి - ఖాజీపేట

టిడిపి ప్రభుత్వంతోనే ముస్లింల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర మైనారిటీ కార్యనిర్వాహక కార్యదర్శి కమలాపురం ఫరూక్ అహ్మద్ పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నారా చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర ముస్లిం మైనారిటీ వర్క్ షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ముస్తాక్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మైనార్టీలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం మైనారిటీల సమస్యల గురించి, టిడిపి అభివృద్ధికి ముస్లిం మైనారిటీల సహాయ సహకారాల గురించి సమావేశంలో చర్చించినట్లు కమలాపురం ఫరూక్ అహ్మద్ తెలిపారు. పార్టీ కార్యాలయ ఆవరణలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించినట్లు తెలిపారు.



కార్యక్రమంలో పాల్గొన్న ముస్లిం మైనార్టీ నాయకులు

ప్రభుత్వ కార్యాలయాలపై అవగాహన

ప్రజాశక్తి - చాపాడు



పోస్టాఫీస్ వద్ద అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మండల పరిధిలోని లక్ష్మీపేట ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు శనివారం నో స్కూల్ బ్యాగ్ డే సం దర్భంగా గ్రామ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు జవహర్ మున్నీర్, సుబ్బరాయుడు విద్యార్థులను సచివాలయం, చెత్త నుండి సంపద తయారీ కేంద్రం, పోస్టాఫీస్, ఆర్‌బికె పశు వైద్యశాల, ఆరోగ్య ఉప కేంద్రాల వద్దకు తీసుకువెళ్లి వాటి గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులకు చిన్నప్పటి నుండే కార్యాలయాలపై అవగాహన కల్పించడం వలన ఉపయోగకరంగా ఉంటుందని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రతినెల 2, 4 శనివారాలు విద్యార్థులకు పుస్తకాలు లేకుండా ఐదు అంశాలపై అవగాహన, కథలు, అల్లికలు, బొమ్మలు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

దళిత నాయకులను అవమానించడం తగదు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పింఛనులను పునరుద్ధరించాలని దళిత సంఘాల నాయకులు అడిగితే వారిని అవమానించడం తగదని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు జంగాల మునిస్వామి పేర్కొన్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద డిప్యూటీ సిఎం అంజాద్ బాషాకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ ఈ నెల 5న కడప 42వ డివిజన్‌లో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో రద్దయిన పింఛన్ల గురించి మాజీ ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా నాయకుడు కె.ఎన్.రాజు మాదిగ డిప్యూటీ సిఎంతో మాట్లాడితే ఆయన రాజును అవమానంగా మాట్లాడారని ఆరోపించారు. పింఛన్లను పునరుద్ధరించాలని గతేడాది డిసెంబరు 28, 29న కడప కలెక్టర్ కార్యాలయం ఎదుట దీక్షలు చేశామన్నారు. డిప్యూటీ సిఎం అంజాద్ బాషాను కేబినెట్ నుంచి వెంటనే భర్తరఫ్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు పాపోడు, రాజశేఖర్, మహాజన సోషలిస్టు పార్టీ జమ్మలమడుగు మండల అధ్యక్షులు చింతాకు రాముడు, జమ్మలమడుగు గౌరవాధ్యక్షులు గొనిగనూరు చెన్నప్ప, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు కోట సుబ్బయ్య, వెంకట సుబ్బయ్య, ఎమ్మార్పీఎస్ జమ్మలమడుగు నియోజకవర్గం యువసేన అధ్యక్షులు ముద్దనూరు హరికృష్ణ, ఎంఎస్‌పి నాయకులు, ఊసేన్, ఓబులేసు, అంజనాపురం రామకష్ణ, శేషు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు

క్షతగాత్రులను పరామర్శించిన రెడ్యం

ప్రజాశక్తి - ఖాజీపేట



పరామర్శిస్తున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

మండల పరిధిలోని భూమాయపల్లె వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముత్తులూరుపాడు దళిత వాడకు చెందిన దవనం ఓబులు, దవనం చిన్న ఓబులు, డ్రైవర్ నాగలా రాపు కదిరయ్య తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కడప రిమ్స్‌కు తరలించారు. దవనం చిన్న ఓబులును కడప నగరంలోని హిమాలయ ఆసుపత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న టిడిపి ఆవిర్భావ రాష్ట్ర సీనియర్ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి వారిని ఆయా ఆసుపత్రుల్లో పరామర్శించారు. సంబంధిత డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. త్వరితగతిన కోరుకోవాలని రెడ్యం ఆకాంక్షించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.కార్యక్రమంలో భూమాయపల్లె మాజీ సర్పంచు కొంగాని రామాంజనేయులు యాదవ్, బి.కొత్తపల్లి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ముత్తూరు రఘురామిరెడ్డి, టిడిపి నేతలు మల్లె ఓబయ్య యాదవ్, తవ్వా చిన్నసుబ్బారెడ్డి, గంగుల వెంకట్రామయ్య, దవనం ఓబులు, తిప్పిరెడ్డిపల్లె రాముడు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ ముఖ్యం

ప్రజాశక్తి - చాపాడు

విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా ముఖ్యమని సిబిఐటి కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, ప్రెసిడెంట్ మాధవి సూచించారు. స్థానిక సిబిఐటి కళాశాలలో శనివారం డిప్లొమా మొదటి సంవత్సరం విద్యార్థుల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ డిప్లొమా విద్యార్థుల ప్రతిభ చాలా బాగుంటుందన్నారు. సాధించాలనుకున్నది పట్టుదల, క్రమపద్ధతిగా సాధించాలని సూచించారు. గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమయాన్ని వృథా చేయకూడదని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ మీ భవిష్యత్ మీ చేతుల్లో ఉందన్నారు. అనంతరం చైర్మన్, ప్రెసిడెంట్, ప్రిన్సిపల్‌ను డిప్లొమా హెచ్‌ఒడి రమేష్ బాబు ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.
ఫోటో సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక రోటరీపురంలో ఉన్న అబ్దుల్ రషీద్ అనే వ్యక్తికి శనివారం సిఎం సహాయ నిధి చెక్కును వైఎస్ భాస్కర్‌రెడ్డి అందజేశారు. అబ్దుల్ రషీద్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆ ప్రాంత వైసిపి నాయకులు, బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్, బాబయ్య కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఎంపీ స్పందించి వైద్యానికి సీఎం సహాయ నిధి నుంచి రూ.4,50,000 చెక్‌ను పంపించారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఈశ్వరయ్య, మునిసిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, దేవదాయ మాజీ చైర్మెన్ ఏర్వ వెంకటసుబ్బయ్య, కడియాల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న వైఎస్ భాస్కర్‌రెడ్డి, నాయకులు

నేడు దువ్వూరులో ఉచిత వైద్యశిబిరం

దువ్వూరు : స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని పోలీస్ క్వార్టర్స్ ఆవరణలో ఆదివారం శ్రీ వినాయక ఫౌండేషన్ టీమ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మైదుకూరు హెచ్‌సిసి హాస్పిటల్ వైద్యులు చంద్రశేఖర్ తెలిపారు. జబ్బులతో ఇబ్బందులు పడేవారు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సంక్రాంతి సంబరాలు జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : సంక్రాంతి సంబరాల్లో భాగంగా పట్టణంలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహిస్తున్నమని, విజయవంతం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్‌రాజ్, ఎస్ఎఫ్ఐ సురేష్, జెవివి సురేంద్ర కోరారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ యువకులకు క్రికెట్ పోటీలు, మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రికెట్ ఆడే వారు ప్రవేశ రుసుం రూ.500, ముగ్గుల పోటీలో పాల్గొనే వారు ప్రవేశ రుసుం రూ.200 చెల్లించాల్సి ఉందన్నారు. విజేతలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తిగలవారు 95024 94474, 76710 73221, 88868 98483సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో చెన్నయ్య, భాస్కర్, సురేష్ పాల్గొన్నారు.